

పి.యస్.ఆచార్య

"దవోల్డు ఉమెన్ శాట్ అన్‌హర్ సీన్...
...దవోల్డు ... దవోల్డు' గుక్క తిప్పుకోకుండా వల్లిస్తున్నాడు సూరిగాడు.

రావుఁలు పొయ్యిమీది కుండలో తుక తుకలాడే గంజి మాట మర్చిపోయి సూరిగాడి పాఠం వింటోంది. కుండలో గంజి లాగే రావుఁలి కడుపులో ఆశలు తెర్లుతున్నాయి.

"ద...సీస్...వు ..వు...మెన్...ఓల్డు' సూరిగాడు జోగుతున్నాడు.

"అచ్చరం ముక్కరాని నీ కడుపున సెడ బుట్టాడే యీడు. సూడు తిరగేసిమర్లేసి ఎట్లా సదువుతున్నడో" మంచం మీద పడున్న సీతాయి పెళ్ళాన్ని ఎత్తి పొడిచేడు.

గుండెల్లోంచి సంతోషంగా ఎగదన్నింది మోసు నోట్లోంచి చుట్ట పొగని గుప్పుమని వొదిలేసి మీసాలు సవరించేడు.

"నువ్వు సది వెలగ బెట్టినవ్‌లే" ఓ బాణం లాంటిది మొగుడి మీద పారేసి విశ్చింతగా పాఠం విన సాగింది రావుఁలు.

సీతాయి మీసాల్లోంచి సన్నగా నవ్వేడు.

"నాయాల్ది, నాకులేని సదువు నా బిడ్డ నేరుస్తడే. నా కండలు కరిగిచ్చి బిడ్డని పట్నం సదువుకి పంపాలే" అంటో ఆరిపోయిన సుట్టని యింట్లోనే ఓ మూలకి గిరవాటు పెట్టేడు.

"కాళ్ళ గడుగు" అంది రావుఁలు కుండ దింపేసి. సీతాయి లేచాడు.

రావులు చెప్పేమాటల్నీ, దోసుల సంగీతాన్నీ వింటో గంజి త్రాగసాగేడు.

"ప్రొద్దున్న మల్లీ అయ్యవారొచ్చిండు" చెప్పింది రావుఁలు. గొంతులోంచి జారుతున్న గంజి అట్లానే ఆగిపోయింది సీతాయికి. "ఏవన్నడు!"

"ఏవుంది మామూలే, బినా నీకు బుద్దుండాలె" అంటూనే కన్నీళ్ళెట్టింది రావుఁలు.

పన్నెండేళ్ళ నాడు......

"సీతాయితో నీకు పెళ్ళేటే కాకి ముక్కుకి దొండ పండునాగ. మరోణ్ని సూద్దాం" అని వాళ్ళ నాయన అన్నప్పుడు కన్నీళ్ళెంట్టింది రావుఁలు.

మళ్ళీ యివ్వాళ......

"నాకేదో మూడింది" అనుకున్నాడు సీతాయి.

గుండెల్లోంచి రైళ్ళు పరుగెట్ట సాగేయి. గంజి తాగిచ్చి మూకుడు ముందునుంచి లేచేడు. బజార్నపడి అయ్యవారింటికేసి నడువసాగేడు.

కునుకుతున్న సూరిగాణ్ణి చాపమిదికి చేర్చి తడిక తలుపు దగ్గరసావేసి బయల్దేరింది రావుఁలు.

చెట్టు క్రింద క్రీనీడలో కిల్చున్న కోటాయి వొచ్చిరాని దగ్గు దగ్గేడు, మెటికలు విరిచి వాడి మొహాన్న పారేసి సాగిపోయింది రావుఁలు.

సీతాయి సరాసరి అయ్య వారింటి కెళ్ళేడు. అయ్యవారు మంచంమీద కూర్చుని పాలికాపుతో మాట్లాడుతున్నాడు.

"దండం బాబయ్యా" అన్నాడు సీతాయి.

అయ్యవారు పాలి కాపుని పంపేసి యిటు తిరిగేరు.

"ఏవిటి నిర్ణయించేవు" అంటో.

సీతాయి మాట్లాడలేదు.

"పిల్లాడికి పట్నం చదువు అక్కరలేదా!" అన్నాడయ్యవారు ఉగ్రుడై పోయి.

సీతాయికి మెత్తపడక తప్పలేదు.

అతనంటే ఆ పూళ్ళో జనానికి కొద్దో గొప్పో భయం ఉండనేఉంది. అందుచేత ఈ పనికి సీతాయినే ఎన్నుకున్నాడయ్యవారు.

కొడుకు భవిష్యత్తు కళ్ళల్లో మెదుల్తోంది. "ఒప్పుకో" అంటున్నాడయ్యవారు.

మౌనంగా అంగీకరించేడు.

అయ్యవారు పొంగిపోయి రొంటినుండి ఓ వందతీసి "ఎడ్వాన్స్" అంటూ చేతిలో పెట్టేరు.

మారు మాట్లాడకుండా పుచ్చేసుకుని పొలాల వెంపు వెళ్ళిపోయ్యేడు.

వాడికి రావుఁలు గుర్తొచ్చింది. సూరిగాడు గుర్తొచ్చేడు. వాడి భవిష్యత్తు గుర్తొచ్చింది. దాంతో తను చేయబోయే పనిని తూకంవేసి చూచేడు. తన ఊహలవేపే మొగ్గు చూపుకుని చురుగ్గా అడుగులు ముందుకి వేశాడు.

"అయ్యవారు పిచ్చోడు. ఎదవ ఎద్దల పందెంలో ఎపుడు గెలిస్తేనేం! గురవయ్యగారి కోడె అయ్యవారి కోడెమీద ఎట్లాగూ మిగులే! అందుచేతనే దాన్ని అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నడయ్యవారు." అనుకొంటూ రొంటిని దోపుకున్న మందు సీసాని తడివి చూచుకున్నాడు.

గురవయ్య కొట్టంలో "లైటు" వెలుగుతోంది. లోనికి వెళ్ళాడు.

పాలేరు గుర్రు తీస్తున్నాడు.

సీతాయికి కోడెని చూడగానే కన్నీళ్ళొచ్చేయి. అయ్యవారిచ్చే డబ్బుకి ఆశపడి ఏనుగులాంటి కోడెకి మందెట్టాలి మరి!

కోడె గంభీరంగా నించుని నిశ్చింతగా నెమరు వేస్తోంది. గుండెలు గుబగుబ లాడుతున్నాయి. పాలెరు దొర్లేడు.

సీతాయి స్తంభం చాటు నక్కి చూడసాగేడు. పాలేరు కలవరిస్తో మధ్య మధ్య గురక తీస్తో నిద్రపోతున్నాడు.

గాబులో సగం నీళ్ళు సారబోసి తౌడు కలిపేడు. తౌడుతోపాటు వొణికే చేతుల్తో విషం కలిపేడు.

ఓ ప్రక్క గుండెల్లోంచి మూలుగు! తావి,

సూరిగాడి చదువూ, పెద్దయ్యాక వాడి హోదా తలుచుకుని, ధైర్యం చెప్పుకుని కోడెకి తమ్మె తప్పించేడు.

గాబు దగ్గిరకి తోలేడు.

గాబులో నీళ్ళన్నీ క్షణంలో పీల్చేసి అమాయకంగా వెళ్ళి గాటి దగ్గిర నిలబడింది కోడె తమ్మె తగిలించి వెనుదిరిగేడు.

డొంకదారి వెనక్కి పోతూంది. ఆకాశం నిండా చుక్కలు!

రాత్రి అనే నటీమణి చెంపలమీది చెమ్కీ రవ్వల్లా ఆకాశం నిండా చుక్కలు!!

బాణా కర్రపోటు వేస్తూ నడుస్తున్నాడు.

కాళ్ళముందునించి ఏదో సర్రున దూసుకుపోతోంది. కోడెత్రాచు!!

ఆలోచనలు కుంచించేయి. ఎవరో హెచ్చరిస్తూన్నట్లు గుండె దడదడలాడుతోంది.

"ఒరే! సీతాయి! నువ్వు పాపం చేసేవురా! బంగారంలాంటి కోడెను చంపేవు. కోడెశాపానికి తిరుగులేదురా! రేయ్! నువ్వు నాశనమైపోతావు" సీతాయిలోంచి మరో సీతాయి శపించేడు.

అసలుసీతాయి సమాధానం చెప్పేడు. "నేను ఏమైతేనేం? నాకొడుకు చదవాల! వాడు ఉద్యోగం చెయ్యాల. ఒరే! లోపలున్నసీతారాయ్! డబ్బులో ఉందిరా పెపంచకం!

డబ్బు నేకపోతే నాపిల్లాడికి చదువునేదు. నాకూ నా రావులికీ కూడునేదు.

ఉండోళ్ళు చేసేపనుల్లో నేను చేసింది ఎన్నోవంతురా!

గడ్డితిని బతికే పెపంచకంలో పుట్టాన్నేను. నన్ను గడ్డితినొద్దంటావేరా ఎదవనాయాల.

ఒరేయ్! లోపలిసీతారాయ్! నీకు తెల్దంట్రా?

డబ్బుకోసం నాపెళ్ళాం సారాయి అమ్మతోందిరా! నేను రెక్కలమ్ముకోని డబ్బు సంపాదిస్తున్నాను. నేనుతెచ్చేది పొట్టకూటికి. నా పెళ్ళాం తెచ్చేది పోలీసులకీ సరిపోతాంది.

మరి నా పిల్లాడిసంగతేంగావాల్రా!

రేయ్! సీతిగా! నేను దుర్మార్గంచేసినా నాకొడుకుని దర్జాగా బతికేట్టు సేస్తన్నాన్రా!

నా ఎదానపడి యేడుస్తావేం? అబ్బా!"

వ్రేలు చితికింది ఎదురుదెబ్బకి. రక్తం వొడుస్తోంది వాడుచేసిన పాపం కలిసినట్లు నల్లగ నెత్తురు!

సారాయి కొట్టుదగ్గిరకు వొచ్చేడు సీతాయి తాగినవాళ్ళగోల......

సీతాయి మనసు కుమిలిపోతోంది.

"ఈళ్ళ మధ్యలో రావులు ఎట్టాబ్రతుకుతోంది. తప్పదు మరి!

డబ్బుకోసం ఏనరకంలోనైనా బతుకుతాడు మడిసి!

రావులు ... కొత్తల్లో ... బనవాళ్ళందర్నీ కాదని కావరాని కొచ్చినప్పుడు ... మగాడు కని పించితే బెదురుగొడ్డులా తప్పుకుపోయ్యేది.

తర్వాత తర్వాత ముఖ్యంగా సూరిగాడు పుట్టాక పూర్తిగా పెపంచకంలో కలిసిపోయింది ఆలోచిస్తూనే లోనికివెళ్ళేడు. "కట్టెయ్యే" అంటో! ఇద్దరు కలిసి మహోజనాన్ని బైటికితోలేరు లోపలదాచిన జాడీలోంచి ఓగ్లాసు చిక్కటి కల్లుతెచ్చి సీతాయికిచ్చింది రావులు.

సీతాయి త్రాగలేదు. ప్రక్కనే పెట్టేడు. "పదయే" అంటో.

ఇద్దరూ నడుస్తున్నారు ఇంటికేసి.

"ఎల్లొచ్చేనే" చెప్పేడు.

"అర్నీ జిమ్మడిపోను. శాపానపోతవ్......" తిట్టిపోస్తోంది రావులు

"పోతే నేనేగదంటే పోతాను. కాని మన బుల్లోడు చదువుకుందికి నాలుగురాళ్ళు తెచ్చేనే. అయ్యవారు రెండువేలు డబ్బూ, మూడెకరాల పొలవూ పారేస్తానన్నాడు" సర్దిచెప్పేడు.

రావులు ఇబ్బందిగానే నడుస్తోంది. బజారు మూల దిరిగేరు.

"ఓ యమ్మో! నా సూరిగాడో" అంటూ కూలిపోయింది రావులు సీతాయి రావుల్ని వాటేసుకుని అటుకేసి చూచేడు.

"ఒరే సూరిగా నేను కట్టిన మేడలన్నీ కూలిపోసేవు కదరో" బావురు మన్నాడు సీతాయి.

జనం నీళ్ళు జల్లేరు.

మంటలారి పొయ్యేయి.

సూరిగాడి శవాన్ని ఎవరో బైటకి లాగేరు.

రావులు మోకాళ్ళ మీద పడి పడి శోకాలు పెడుతోంది.

"దవోల్డు ఉమెన్ శాట్ ఆన్ హార్ సీస్" సూరిగాడి సగం తెరచిన నోరు చదువు తున్నట్లే ఉంది అర్థంకాని చీకటి కోణాలను వివరిస్తోన్నట్లు వికృతంగా...సగం తెరిచిన నోరు...చెట్టు క్రింద క్రీనీడలోంచి కోటాయి వొచ్చి రావి దగ్గు దగ్గేడు.

సీతాయి తలెత్తి చూచేడు.

ఆరిపోయిన కొంపలోంచి పొగ మేడలు పైకి లేచి గాలి విసురుకి చెదిరి పోతున్నాయి.

★

---

# విశేషాలు విశేషాలు

—కొడిమెల శ్రీరామమూర్తి

## ఎలుకలకు యంత్రం!

ఈ యంత్రం కథా కమామిషూ ఏమిటంటారా! ఈ యంత్రాన్ని జపాన్‌లోని ఒక కంపెనీ రూపొందించింది. ఇళ్ళల్లో మూషికాలతో అవస్థలు పడే వారికి ఈ యంత్రం వరప్రసాదం వంటిది! సదరు ఎలుకల యంత్రం కరెంటుతో పని చేస్తుంది! ఇది ఎలుకలను చావ గొడుతుందను కొంటున్నారా? అబ్బే! ఇది కేవలం ఎలుకలను పార ద్రోలడానికి మాత్రమే తన శక్తిని వినియోగిస్తుంది! సీలింగు ఫాన్‌కు మనం ఎలాగైతే కరెంటుతో కనక్షన్ ఇస్తామో, అలాగే ఈ కొత్త యంత్రానికి కనక్షన్ ఇస్తే అది తిరుగుతూ అల్ట్రాసానిక్ తరంగాలను ప్రసారం చేస్తుంది. దానిశక్తి 19 వేల సైకిల్స్ అల్ట్రాసానిక్ తరంగాలు. ఎలుకలు ఆ తరంగాల తాకిడిని తట్టుకోలేక పలాయనం చిత్తగిస్తాయి! చిత్రమేమిటంటే ఆ అల్ట్రాసానిక్ తరంగాల వల్ల మనకు ఎటువంటి హానీ ఉండదా! బావుంది కదూ! ఈ యంత్రం మన దేశానికి వచ్చి ఎలుకలపై మంత్రంగా ఎప్పటికి పని చేస్తుందో గదా!

## దయ!

మన నౌకాదళం యుద్ధ సమయంలో ఎంతో పరాక్రమం చూపుతుంది. చేజిక్కిన శత్రువుపై అంతేదయనుకూడా చూపుతుంది! మనకు పాకిస్తాన్‌కు జరిగిన యుద్ధసమయంలో మన నౌకల బారినుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించిన ఒక నౌకపై మనసైన్యం గుళ్ళవర్షం కురిపించింది. అప్పుడు ఆ నౌకలోని థాయ్‌దేశస్థుడు బాగా గాయపడ్డాడు. ఓడతాలూకు ఇనుము ముక్క ఒకటి అతని రొమ్ముగుండా దూసుకుపోయిందట. మన సైనికులు ఎంతో దయతో అతన్ని విక్రాంత్ నౌక మీదకు తీసుకువెళ్ళారు. రెండుగంటలపాటు అతనికి డాక్టర్ చేత ఆపరేషన్ చేయించి ఆ ఇనుప ముక్కను బయటకు లాగించారు. ఆపరేషన్ సమయంలో ఆ థాయ్‌దేశస్థునికి రక్తం కావలసి వచ్చింది. మన నావికులు ఒకరితో ఒకరు పోటీలు పడి అతనికి తమరక్తాన్ని దానం చేశారు. 9 రోజుల తర్వాత అతనికి స్వస్థత చేకూరింది. చూశారా మనవారి ఔదార్యం!

## 'నాట్' విమానం కథ

పాకిస్తాన్‌పై ఇటీవల మనం జరిపిన యుద్ధంలో 'నాట్' విమానాలు వహించినపాత్ర అమోఘమైన పని మనమంతా ప్రశంసించాం! అయితే వెనుకటి రోజుల్లో ఆ విమానాలు ఇంతగొప్పపని ఎవరి ఊహకూ తట్టలేదు! అప్పట్లో ఒక బ్రిటిష్ ఇంజనీరు నాట్ విమానం నమూనాను పండిట్ నెహ్రూకు చూపాడు దానినిచూసిన విమానదళసిబ్బంది, తదితర ప్రముఖులూ అది బావుండలేదనీ, సరిగా పనిచెయ్యదనీ నోళ్ళు చప్పరించేశారు! అప్పుడు నెహ్రూజీ దీర్ఘంగా ఆలోచించారు. ఆయనదృష్టి బహు విశాలమైందిగదా! అందుకనే ఆయన ఆ విమానాన్ని వినియోగించడానికి అంగీకరించారు. మహామహుల చర్యలు ఇలాగేఉంటాయి! నెహ్రూజీ దయవల్లనే 'నాట్'లు మనకు వరప్రసాదంగా లభ్యమయ్యాయి! ఆ 'నాట్'లను చూసి పాక్ విమానాలు తోకలుముడి చాయి! తమఆకారాలను వికారాలుగా చేసుకున్నాయి!